# జ్ఞాపకాలె మైమరపు

రాజా అనే సినిమాలో, ఏదో ఒక రాగం అనే ఒక పాటని, ముందు బాలు తర్వాత చిత్ర పాడతారు. ఆ పాటంటే నాకూ శ్రీమతికీ చాల ఇష్టం. చిత్రకి తెలుగు రాకపోయినా తెలుగువారికన్నా మిన్నగా ఎంతో భావగర్భితంగా పాడిందా పాట అలాగే ఆ పాటకి ఇచ్చిన బాణీకూడా ఎంతో శ్రావ్యంగా, మృదుమధురంగా వుంది అంతకన్నా మించినది ఆ పాట వ్రాసిన సిరివెన్నెల సీతారామ శాస్త్రి సాహిత్యం

ఏదో ఒక రాగం పిలిచిందీ ఈ వేళా, ఎదలో నిదురించే కథలెన్నో కదిలేలా।

ఈ మాటలకన్నా కూడా మనల్ని బాగా కదిలించేవి తరువాతి చరణాలు

జ్ఞాపకాలే మైమరుపు, జ్ఞాపకాలే మేల్కొలుపు, జ్ఞాపకాలే నిట్టూర్పు, జ్ఞాపకాలే ఓదార్పు

జీవితాన్ని మథించి శోధించి సాధించినవీ వాక్యాలు. సాదాసీదా మామూలు సినిమా రచయితలకి కలలోకూడా అందని భావతరంగాలు. ఆనాటి సముద్రాల, మల్లాది, దేవులపల్లి, ఆరుద్రల సరసన కూర్చున్న ఈ సిరి వెన్నెల తరంగాలు.

అమ్మ కళ్ళల్లోని చెమరింతలు చూసిన సంఘటనలూ, అమ్మ చీర చెంగు వేలికి చుట్టుకుంటూ వెంటవెంటనే తిరిగిన పసితనం, చిన్నప్పుడు జామపళ్ళు దాచుకున్నచోటూ, పుస్తకంలో నెమలికన్ను దాచుకునే వయసూ, గుళ్ళో కథ వింటూ నిదురించిన సందర్భంలాంటి జ్ఞాపకాల గురించి వ్రాస్తాడు కవి. మనందరికీ కూడా అలాటి జ్ఞాపకాలు ఎన్నో మరెన్నో తీయని మధురస్మృతులుగా మన హృదయాల్లో నిదురిస్తూ, అప్పుడప్పుడూ కదిలి మనకి ఆ మైమరుపునీ మేల్కొలుపునీ నిట్టూర్పునీ ఓదార్పునీ ఇస్తుంటాయి. ఆ జ్ఞాపకాలు మనకి ఆనందానివ్వటమే కాదు, మనం ఉత్సాహంతో ముందుకు పోవటానికి టానిక్‌లాగా అవసరం కూడాను.

మనం ఎవరితోనైనా పెద్దవాళ్ళతో మాట్లాడుతున్నప్పుడు, మా రోజుల్లో ఇలా వుండేదా, అప్పుడూ. అంటున్నప్పుడు వినేవాళ్ళకి చాదస్తంగావుంటుందేమో కానీ నిజంగా అప్పుడు జరిగేదేమిటో తెలుసా? ఆ సమయంలోఆయన/ఆవిడ తమ పాత జ్ఞాపకాల్లోకి, కొన్ని దశాబ్దాల వెనక్కి వెళ్ళిపోయారన్నమాట ఈ సందర్భంలోనే బాపూగారి ఒక కార్టూన్‌కూడా గుర్తుకొస్తున్నది. ఓ పసిపిల్లవాడిని ముగ్గురు అందమైన ఆడవారు ఎత్తుకుని ఆడిస్తూ ముద్దులు కురిపిస్తుంటే, నాలుగేళ్ళ కుర్రాడు ఇంకో సత్తెనకాయతో అంటుంటాడు, "ఎన్ని చెప్పు' ఆ చిన్ననాటి రోజులు మళ్ళీ

రావురా .. మళ్ళీరావు " అని.

మా వూళ్ళో ఉమామహేశ్వరం అంతే. మాట్లాడుతూ మాట్లాడుతూనే తన జ్ఞాపకాల్లోకి వెళ్ళిపోయి "మేం గుంటూర్లో హైస్కూల్లో చదివేటప్పుడు తాలూకాఫీసులో క్రికెట్టాడుతుండేవాళ్ళం. సన్నగా పొడుగ్గావుండే మా సుబ్బారావ్ చెయి అలా మెలిక తిప్పి బౌలింగ్ చేస్తుంటే, ఎంత బాగుండేదో తెలుసా? అసలు లెగ్ బ్రేక్ వేస్తున్నాడో, ఆఫ్ బ్రేక్ వేస్తున్నాడో బంతి తిరిగేదాకా తెలిసేదే కాదు. అప్పుడే అనుకునే వాళ్ళం సుబ్బారావుగాడు ఏదో ఒక గాడు దయుంటే టెస్ట్లో ఆడతాడని"

ఆయన ఆ మాట అంటుంటే, మా ప్రకాష్ అందుకునేవాడు "అవును. బెజవాడలో మేమేం చేసే వాళ్ళమో తెలుసా? గవర్నర్‌పేట సెంటర్‌లో వుండేది మిరపకాయ బజ్జీల బండి. సాయంత్రం ఆరయేసరికీ, రోడ్డంతా ఘుమ ఘుమాయింపులే మరి. రోజూ నేనూ, మా నరసింహం, రంగడూ తలో నాలుగూబజ్జీలు తినేవాళ్ళం. ఆ బజ్జీ పొట్ట కోసి దాంట్లో సన్నగా తరిగిన కొన్ని ఉల్లిపాయముక్కలూ, నిమ్మకాయ రసం తగిలించి తింటే, దటీజ్ ది అల్టిమేట్ థింగ్ ఇన్ లైఫ్. మేమూ బజ్జీలు తినకపోతే, ఆ రోజు కానీ, ఏ రోజు కానీ చీకటి పడేది కాదు. బజ్జీలు తినగానే, పక్కనే సోడా బండి గవర్నర్‌పేట సెంటర్లో గోలీ సోడా కొడితే అటు గొల్లపూడిదాకా వినపడాల్సిందే మరి"

శనివారం పార్టీలో కాంతమ్మ అనేది. "మా రాజమెండ్రిలో శాంత గురించి మీకు చాలసార్లు చెప్పాను గుర్తుందా? దానికి చిన్నప్పటినించీ పల్లమాలిన దేశాభిమానం. దొంగరాముడులో భలే తాత మన బాపూజీ అనే పాట వుంది గుర్తుందా ఆ పాట వింటుంటే దానికి కళ్ళల్లో నీళ్ళు వచ్చేవి. అలాగే లతా మంగేష్కర్, ఏ మేరె వతన్‌కి లోగోం అని పాడుతుంటే పెద్దగా ఏడిచేది. లాల్ బహదూర్‌శాస్త్రిగారు ప్రధానమంత్రి అయినప్పుడు, ఆయన ధాన్యాన్ని పొదుపు చెయమన్నారని ఆయన సందేశం పాటించి, ప్రతి సోమవారం రాత్రి అన్నం తినటం మానేసింది. నేను అమెరికా వచ్చేటప్పుడు అందరూ సంతోషించినా అది మాత్రం మనదేశం వదిలి ఎలా వెళ్ళిపోతున్నావే అని ఒకటే బాధ పడింది"

ఇలాటి మధుర స్మృతులెన్నో మనసులో కదులుతుంటే, పిక్నిక్ అరేంజేసిన పార్క్‌కి చేరుకున్నాం. పార్కులో కారు పార్క్ చేసి, చెట్టు కింద కూర్చుని పేకాభిరామాయణం చేస్తున్న మిత్రబృందం దగ్గరికి వెళ్ళాం. అరకు రాణిని పారేస్తూ అన్నాడు ఉమామహేశ్వరం, నేనీమధ్య గుంటూరు వెళ్ళినప్పుడు ఏమయిందో తెలుసా? సాయంత్రం సరదాగా పిల్లలు ఆడే క్రికెట్ చూద్దామని, తాలూకాఫీసు గ్రౌండ్‌కి వెళ్ళాను. తాలూకాఫీసువుంది కానీ,అక్కడ గ్రౌండ్ లేదు. అక్కడన్నీ ఏవో చాల బిజినెస్‌లు వచ్చాయి. ఎక్కడ చూసినా చెప్పుల షాపులు. పక్కనే వున్న మిషనరీ గ్రౌండ్‌కూడా అంతే. అక్కడ మా రోజుల్లోలా అసలు ప్లే గ్రౌండ్ లేదిప్పుడు"

"మరి మీ స్పిన్నర్ సుబ్బారావెలా వున్నాడు?" అడిగాను

ఉమామహేశ్వరం నవ్వాడు. "ఇంకా ఏం సుబ్బారావ్. వాడికి రాజకీయాలతో సరైన అవకాశాలు లేక, అప్పుడే క్రికెట్ ఆడటం మానేశాట్ట. అంతేకాదు వాడి

చేతికి ఆర్థ్రైటిస్ కూడా వచ్చింది"

ఎవరేం మాట్లాడుతున్నా ఆ టాపిక్ వదిలేసి తన గోలేదో తను చెప్పటం ప్రకాష్‌కి మొదటినించీ అలవాటు. అందుకే అన్నాడు "బెజవాడ వెళ్ళానా సరాసరి మా నరసింహం దగ్గరికి వెళ్ళాను. వాడేమో ఆ వూళ్ళో పేరుమోసిన పెద్ద ఆడిటర్. ఆ పేరుతోపాటూ, ఊళ్ళో అందరి బిజినెస్ లెక్కలూ వాడే మోస్తున్నాడేమో పగలూ రాత్రీ శనివారం ఆదివారం అంతా ఒకటే వాడికి. పని. పని. పని ఒక రంగడూ అంతే. బాగా బిజీగా వుండే డాక్టరేమో... వాడు మాట్లాడే పద్ధతే వేరు. స్టాక్ మార్కెట్, స్థలాలు కొనటం, నన్నేమైనా ఇన్వెస్ట్‌మెంట్ చేస్తావా అని అడగటం...."

కొంచెం దూరంగా కూర్చున్న కాంతమ్మ శ్రీమతితో అంటున్నది. "పోయిన దీపావళి సంచికలో (అంటే దీపావళికి కలిసిన పార్టీలో అని మనం అనుకోవాలి) మా శాంత గురించి చెప్పానే, దానికి దేశభక్తి చాల ఎక్కువ అని. పూర్తిగా మారిపోయిందది. దాంతో మాట్లాడి ఎన్నో ఏళ్ళయింది కదా అని మొన్న ఫోన్ చేస్తే వాళ్ళ బ్బాయికి అమెరికాకి వీసా ఎలా వస్తుంది, ఏమైనా అమెరికా సంబంధాలున్నాయా అని మొదలుపెట్టింది. దానికీ ఈ వయసులో ఇక్కడికి రావాలని కోరిక పుట్టింది"

"రోజులు మారిపోతున్నాయి.." అంటున్నది ఇంకో ఆవిడ.

ఆరోజుల్లోనూ, ఈరోజుల్లోనూ కూడా రోజుకి ఇరవై నాలుగు గంటలే. కనుక మారుతున్నవి రోజులు కాదు. మనం. మన ఆలోచనలు. మన జీవన సరళి.

టెక్సాస్‌లో ఆస్టిన్‌కి పక్కనే వున్న చిన్న వూరు మాది. దానిపేరు ఫ్లూగర్‌విల్. మేమిక్కడ పద్దెనిమిదేళ్ళుగా వుంటున్నాం. ఇక్కడ ఒక చిన్న బార్బర్ షాపుంది. మార్టిన్ అని, అతనికి కనీసం అరవై ఐదేళ్ళు వుంటాయి. నా జుట్టు కత్తిరిస్తూ తన పాతరోజుల కథలు చెబుతుంటాడు. ఆ వూరు ఎంత బాగుండేదో మనుష్యులు ఎంత మంచివాళ్ళోలాటివన్నీ. ఈ మధ్య మా వూరు బాగా పెరిగిపోవటం వల్ల పెద్ద బ్యూటీ పార్లర్లూ, హైర్ కటింగ్ సెలూన్లు (నేషనల్ చైన్లు) వచ్చి బిజినెస్ దెబ్బతిని ఇప్పుడది మూసేశాడు. చివరిసారిగా నేను వెళ్ళిన రోజు బాధపడుతూ అన్నాడు. "ఆ పాత రోజులే వేరు. ఇప్పుడు మనుష్యులు మారిపోతున్నారు. వాళ్ళ ఆశలూ, ఆశయాలూ కూడా మారిపోతున్నాయి" అని.

అతనికి వీడ్కోలు ఇచ్చి, వెనక్కి తిరిగి ఇంటికి వస్తుంటే, కారు సిడీ ప్లేయర్లో మళ్ళీ నాకిష్టమైన ఆ పాట వస్తున్నది.

"జ్ఞాపకాలే మైమరుపు, జ్ఞాపకాలే మేల్కొలుపు, జ్ఞాపకాలే నిట్టూర్పు, జ్ఞాపకాలే ఓదార్పు"

అంటే ఉమామహేశ్వరం ప్రకాష్ కాంతమ్మలాగా, నాలాగా, మనలాటి చాలమందిలా, అతనుకూడా ఒక నిట్టూర్పు వదిలి ఇక ఆ జ్ఞాపకాల ఓదార్పుల్లో బ్రతుకుతాడన్న మాట.

* * *